ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 60
సంచిక : 182
పేజీలు : 2
శుక్రవారం, మార్చి 27, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఆస్పత్రి ఉన్న సిబ్బంది సున్నా

**-శాసనసభలో సమస్యను ప్రస్తావించిన ఎమ్మెల్యే**



**టీ మీడియా ,మార్చి 26, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ఉన్న చాలినంత సిబ్బంది లేకపోవడం వల్ల మెరుగైన వైద్యం అందటం లేదని శాసనసభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రస్తావించారు. గురువారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ 2026 బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు వైద్య విధాన పరిషత్ సి హెచ్ సి లున్న, చాలినంత వైద్యులు వైద్య సిబ్బంది కొరత ఉందన్నారు.జిల్లా వార్తలువాటిల్లో 100 పడకాల ఆస్పత్రి, 50 పడకల ఆసుపత్రి 30 పడకల ఆస్పత్రులు నూతనంగా నిర్మాణం జరిగి

మిగతా 2లో

# ప్రమాదకరంగా ప్రచార బోర్డులు

## నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ పోల్స్‌పై ఏర్పాటు



**పోలీస్ పోస్టులను వదలని వైనం**

**అనుమతి లేకుండానే ప్రత్యేక పోల్స్ ఏర్పాటు**

**టి మీడియా, మార్చి 25, ఖమ్మం బ్యూరో:**
ఖమ్మం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నగరం నలుమూలలా నిబంధనలు, చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రచార బోర్డులు, హోర్డింగ్స్‌ను ప్రమాదకరంగా ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు అనుమతుల బదులు, ఆయా ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ పేరును చెప్పుకునే వారికి కప్పం కట్టి వారి అనుమతితో బోర్డులు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

దానికి ఉదాహరణగా రైల్వే స్టేషన్ నుంచి పాత బస్టాండ్ వరకు ఒక బిర్యానీ హోటల్ పేరుతో సీడీఎంఏ నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ పోల్స్‌కు ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక్క బోర్డుకూ అధికారిక అనుమతి లేదు. ఇలాంటి బోర్డులు నగరంలోని వైరా రోడ్, బోనకల్లు రోడ్, బైపాస్, ఓవర్ బ్రిడ్జిలపై కనిపిస్తున్నాయి. ఇవన్నీ నిషేధిత ప్రాంతాలు కావడం, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఉండటంతో



ప్రైవేట్ కలెక్షన్లకు తెరలేపినట్లు తెలుస్తోంది.

**సీడీఎంఏ నిబంధనల ప్రకారం:**
నగరంలో ఎక్కడైనా ప్రచార బోర్డు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ కమిషనర్ అనుమతి తప్పనిసరి. టౌన్ ప్లానింగ్ అధికారి క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలి. వైరా రోడ్, బోనకల్లు రోడ్, ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్ రోడ్ వంటి



ప్రాంతాలు ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ మున్సిపల్ అనుమతి అవసరం. కరెంట్ పోల్స్, ప్రభుత్వ స్థలాలు, ముఖ్యంగా పోలీస్ శాఖ ఆస్తులపై ప్రైవేట్ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం నిషేధం. అయితే ఖమ్మం నగరంలో మాత్రం ఈ నిబంధనలు పూర్తిగా విస్మరించబడుతున్నాయి.

**అత్యంత ప్రమాదకరం:**
కరెంట్ స్థంబాలపై ఏర్పాటు చేసిన బోర్డులు కేవలం ఒక శీటుకు ఇరువైపులా నట్లు వేసి వేలాడదీసారు. దీని వల్ల షార్ట్ సర్క్యూట్ ప్రమాదం ఉండటంతో పాటు గాలివానలకు ఎగిరిపోయే అవకాశముంది.

మిగతా 2లో

## నవమి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



**టి మీడియా,మార్చి 26,భద్రాచలం** :
శ్రీరామనవమి మహోత్సవాల సందర్భంగా రేపు నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ట్రయల్ రన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిమిషానికో ప్రణాళిక (మినిట్-టు-మినిట్ షెడ్యూల్) ప్రకారం అధికారులు సమీక్షించారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద దిగే ప్రాంతం నుండి ఐటీసీ గెస్ట్ హౌస్ వరకు, అక్కడి నుండి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వరకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. అలాగే దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి



మిగతా 2లో






## మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు




**-కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి**

**టీ మీడియా ,మార్చి 26, కామేపల్లి:** రబీ సీజన్లో పండిన మొక్కజొన్నలు కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్క్ ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు , జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం, నాడు కామేపల్లి తహశీల్దార్ కార్యాలయం లో రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు, కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల్లో పైగా రబీ సీజన్లో మొక్కజొన్న సాగు చేయడం జరిగింది అని మార్క్ ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో మొక్కజొన్నలు క్వింటాకు 1600, 1700 రూపాయలు మాత్రమే బహిరంగ మార్కెట్లో రైతులకు వస్తుంది అని ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ ఇరవై నాలుగు వందల రూపాయలు ఉందని మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు ఇంజం నాగభూషణం, సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు బాదావత్ శ్రీనివాసరావు,రైతు సంఘం మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ, కాంటినేని వెంకటేశ్వరరావు,గుండ్ల వెంకటేశ్వరరావు, జానయ్య పాల్గొన్నారు

## యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం!




**టీ మీడియా ,మార్చి 26, కొణిజర్ల** :మండల పరిధిలోని గురువారం ఎల్లన నగర్ గ్రామంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతిని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడాల ప్రదర్శన చేపట్టి, భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.గండికోట రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో కొల్లేటి నాగేశ్వరావు, తిప్పారపు లక్ష్మణ్, జక్కుల భరత్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను స్మరించారు. వారి స్ఫూర్తితో సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే మార్చి 23 నుంచి 30 వరకు వర్ధంతి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాశం అప్పారావు, రాపోలు కృష్ణ, గోగుల సోములు, వెంకన్న, డి. శ్రీనివాసరావు, షేక్ లాల్మియా, గుగులోత్ శివ, కోయడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నవమి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

(మొదటి పేజీ తరువాయి..)

పనులకు నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమం, అనంతరం మిథిలా స్టేడియంలో జరుగనున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తుల రద్దీ, వీఐపీ కదలికలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. అన్ని మార్గాల్లో బ్యారికేడ్లు, సెక్యూరిటీ చెక్‌పోస్టులు, పార్కింగ్ సదుపాయాలు, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ పరిశీలనలో భాగంగా మిథిలా స్టేడియంలో ఎస్ఎల్ఆర్ (సెక్యూరిటీ లియాజన్ రివ్యూ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది వివిధ శాఖల అధికారులకు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై విపులంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, శ్రీరామనవమి మహోత్సవాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు అమలు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, భద్రతా పరంగా ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మరియు అధికారులు కలిసి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**- తహసిల్దార్ కు సీపీఐ(ఎం) వినతి**

**టీ మీడియా,మార్చి26,సింగరేణి(కారేపల్లి):**

రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించటానికి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి సింగరేణి తహసిల్దార్ కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ లో పత్తి, మిర్చి దెబ్బతిని ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న పంటను రైతులు ఎంచుకొని విరివిగా వేశారన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2400 ఉండగా ప్రైవేటు వ్యాపారస్తులు మాత్రం మొక్కజొన్నలను క్వింటా రూ.1600 కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, నాయకులు తలారి దేవ ప్రకాష్, పోడు భూముల సంఘం నాయకులు పాసిని నాగేశ్వరరావు, ఈసం వెంకటేశ్వర్లు, అరేం రవి, భూక్య మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**• కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టి మీడియా, మార్చి 26, తిరుమలాయపాలెం:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లభిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. గురువారం పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలంలో కలెక్టర్ పర్యటించి, ఇస్లావత్ తండా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇండ్ల నిర్మాణ ప్రగతిని వివరంగా తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 802 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 736 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. కొన్ని ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉండగా, మరికొన్ని రూఫ్, లింటల్, బేస్‌మెంట్ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం దశలవారీగా ఆర్థిక సహాయం అందిస్తున్నదని చెప్పారు. పునాది, గోడలు, స్లాబ్, పూర్తిస్థాయి నిర్మాణం వంటి దశల ప్రకారం మొత్తం రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతున్నాయని వివరించారు. పునాది దశ వరకు నిర్మాణం చేయలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ గృహ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యమని, నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. దశలకు అనుగుణంగా బిల్లులు వస్తున్నందున పనులు ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయితే ప్రభుత్వ నిధులు కూడా త్వరగా విడుదల అవుతాయని పేర్కొన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడివో సిలార్ సాహెబ్, హౌజింగ్ డిఇ జగ్రాం, ఏఈ నవ్య, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

## శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ



**టి మీడియా,మార్చి 26,ఖమ్మం :**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు సత్యానికి, న్యాయానికి నిలువెత్తు ప్రతిరూపమని పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, శాంతి, సహనం, విశ్వాసం వంటి విలువలు ఆదర్శమన్నారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షించారు. యువత శ్రీరాముడి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని తెలిపారు. సీతారామచంద్రుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంట సుఖశాంతులు నెలకొనాలని కోరుకున్నారు. భక్తి, శ్రద్ధలతో శ్రీరామ నవమిని జరుపుకోవాలని అందరికీ శుభ ఫలితాలను అందించాలని నామ ఆకాంక్షించారు.

## ఆసుపత్రికి జిల్లాసమన్వయకర్త

**టీ.మీడియా,మార్చి26,చింతూరు :**

జిల్లా హాస్పిటల్ సేవల సమన్వయకర్త ( డి సి హెచ్ ఎస్ ) డా . నీలవేణి చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ( సిహెచ్ సి ) పై ఆకస్మికంగా పర్యటించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె అన్ని వార్డులను సందర్శించి, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలు, నిర్వహణ పరిస్థితులను సమీక్షించారు. స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ( ఎస్ ఎన్ సి యు ) ను పరిశీలించి, అక్కడ నిర్వహణ బాగా ఉన్నందుకు సిబ్బందిని అభినందించారు. డయాలిసిస్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా ఎం వి కోటిరెడ్డి( సూపరింటెండెంట్,) డా రమణరావు గైనిక్, డా భరద్వాజ్, డా స్పందన, డా రామలక్ష్మీనారాయణ – ఎస్ ఎన్ సి యు మెడికల్ ఆఫీసర్, హెడ్ నర్స్ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

## సొంత నియోజకవర్గాల అభివృద్ధి కే మంత్రుల పరిమితం

**- రైతు సంఘం జిల్లా కార్యదర్శి-బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు కృష్ణ**

**టీ మీడియాఆర్చ్ 26,సింగరేణి(కారేపల్లి):**



ఖమ్మం జిల్లా లోని ముగ్గురు మంత్రులు తమ సొంత నియోజకవర్గాలకు అభివృద్ధికి పరిమితమయ్యారని ఏజెన్సీ నియోజకవర్గాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల భూమి కి సాగు నీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తిచేయాలని, ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కారేపల్లి క్రాస్ రోడ్లో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు , వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సు లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా ముగ్గురు మంత్రులు తమ సొంత నియోజకవర్గ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు . గిరిజన నియోజకవర్గాల అభివృద్ధి, సాగు నీరు అందించేందుకు వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు గళం విప్పాలన్నారు. గోదావరి నది పై సీతమ్మ బ్యారేజి నిర్మాణం పూర్తి చేయకుండా సాగు నీరు 2026 ఆగస్టు 15 నాటికి అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైరా రైతు సభలో ప్రకటించారు అని గుర్తు చేశారు. కేసిఆర్ ప్రభుత్వం పూర్తి చేసిన పనులు ఆధారంగా నీరు కొని ప్రాంతాలకు అందించే ప్రయత్నం తప్ప , పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసే పనులు పూర్తి చేయడం లేదని అన్నారు. కారేపల్లి, కామేపల్లి రెండు మండలాల్లో స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సాగు నీటి వనరులు కల్పించలేదన్నారు, బుగ్గ వాగు మీద విశ్వనాథపల్లి వద్ద రాజ్య సభ మాజీ సభ్యులు యల్లమంచిలి రాధాకృష్ణ మూర్తి నిధులు నుంచి ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పనిచేయక పోయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండె బోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆక్స్ఫర్డ్, క్రేంబిడ్జి స్థాయిలో తెలంగాణ విద్యార్థులకు విద్యా అందించాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలు అన్నింటిలో అత్యంత నాణ్యమైన వసతులు, సౌకర్యాలు కల్పించడం తోపాటు విద్యా లో ఉన్న అంతరాలను రూపు మాపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సినీయర్ నాయకులు ఇంజం నాగభూషణం, సిఐటియు జిల్లా నాయకులు కుందనపల్లి నరేంద్ర, బాదావత్ శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ముళ్ళ ఏకాంబరం, పాసిన్ని నాగేశ్వరరావు, కేసగని ఉపేందర్, ఏడుకొండలు , రాంబాబు, విశ్వనాథపల్లి ఉపసర్పంచ్ బొమ్మల ధనమ్మ, షేక్ సైదులు నిర్వాసితుల సంఘం నాయకులు షరీఫ్, సంగెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి ఉన్న సిబ్బంది సున్నా

**(మొదటిపేజీ తరువాయి..)** ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించే వైద్యులు సిబ్బంది లేని కారణంగా వారిని ప్రారంభించడానికి వెనుకాడాల్సిన పరిస్థితి ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉన్న వైద్యులు డిప్యూటేషన్ పై ఖమ్మం పరిసర ప్రాంతాల్లోకి వెళ్లిపోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పనిచేసే వైద్యులకు ఇన్సెంటివ్ పెంచి స్థానికంగా ఉండే అవకాశం కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కి ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదకరంగా ప్రచార బోర్డులు

**(మొదటిపేజీ తరువాయి..)** జిల్లా పరిషత్, చర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో బలహీన భవనాలపై డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటికి గృహ విద్యుత్ కనెక్షన్ల ద్వారా కరెంట్ వాడుతున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ గోడకు కూడా డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీస్ పోస్టుల్లో పోలీసులు లేకపోయినా, అక్కడ ఫ్లెక్సీలతో ప్రచార బోర్డులు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రైవేట్ వ్యక్తులకు డబ్బులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**అద్దె వసూళ్లలో ప్రైవేట్ వ్యక్తులు:**

నగరంలోని పలుచోట్ల కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతి లేకుండా హోర్డింగ్‌లు, బోర్డు స్టాండ్లు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నారు. స్టేషన్ రోడ్ ప్రాంతంలో ఒక బోర్డు స్టాండ్ ద్వారా ఒక వ్యక్తి నెలకు రూ.25 వేలు ఆదాయం పొందుతున్నట్లు సమాచారం. అతనికి నగరంలో దాదాపు 10 స్టాండ్లు ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారంలో ఉన్న వారి అండతో ఇలాంటి దందాలు చేస్తున్న వారు నగరంలో సుమారు 20 మంది వరకు ఉన్నారని అంచనా. వీరి మొత్తం ఆదాయం నెలకు రూ.30 లక్షల వరకు ఉంటుందని సమాచారం. ఇందులో ఎవరి వాటా ఎంత అన్నది తెలియాల్సి ఉంది.

ఇక మున్సిపల్‌లో నమోదైన అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు కూడా కనీసం ట్రేడ్ లైసెన్స్ లేకుండా నకిలీ బిల్లులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చిన్న షాపులు ఎల్‌ఈడీ బల్బుతో బోర్డు పెట్టుకున్నా జరిమానాలు విధించే అధికారులు, అక్రమ హోర్డింగ్‌లను పట్టించుకోకపోవడం వెనుక ఖమ్మం మున్సిపాలిటీలో భారీ స్కామ్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

(మరిన్ని వివరాలు మరో కథనంలో)....